
సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 2 । మార్చి । 2025



డ్రైవర్ గారూ.. తగ్గాలి జోరు

రాజాం–చిలకపాలెం రూట్‌లో బస్సులు యమస్పీడుగా వెళ్తున్నాయి. ప్రమాదాలకు కారణమవుతున్నాయి. - 8లో



దేవుడి భూములు కబ్జా

సింగుపురంలోని దేవుడి భూములు కబ్జాకు గురవుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
ఆది (సా)	సోమ (ఉ)
6.05	4.57

న్యూస్‌రీల్

15 నుంచి ఒంటి పూట బడులు

శ్రీకాకుళం: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈనెల 15వ తేదీ నుంచి ఒంటి పూట తరగతులు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈనెల 15వ తేదీ నుంచి ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, మోడల్ స్కూల్స్, ఎయిడెడ్, ప్రైవేటు, గుర్తింపు పొందిన అన్‌ఎయిడెడ్ పాఠశాలల మెనేజ్‌మెంట్‌లో ఒంటి పూట తరగతులు పక్కాగా అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి ఎంఈఓలు, పాఠశాలల హెచ్‌ఎంలకు ఉత్తర్వులు వెళ్లాయి. అయితే ఇప్పటికే ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున మార్చి మొదటి వారం నుంచే ఒంటి పూట తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని, విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు. పని వేళల్లో ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు తరగతులు నిర్వహించేలా ఉత్తర్వులు విడుదల చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రం ఉన్న పాఠశాలల్లో సాయంత్రం ఒంటి పూట తరగతులు నిర్వహించాలని సూచించారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బీటెక్ ఐదు, ఏడు, బీపీఈడీ మూడో సెమిస్టర్ ఫలితాలు శనివారం పీజీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం విడుదల చేశారు. ఐదో సెమిస్టర్‌లో సీఎస్ఈలో 63 మందికి 46, ఈసీఈలో 68 మందికి 49, మెకానికల్‌లో 60 మందికి 45, సివిల్‌లో 36 మందికి 29 మంది, ఏడో సెమిస్టర్‌లో సీఎస్ఈలో 71 మందికి 62, ఈసీఈలో 63 మందికి 57, మెకానికల్‌లో 59 మందికి 59 మంది ఉత్తీర్ణత సాధించారు. బీపీఈడీలో మూడో సెమిస్టర్‌లో 280 మందికి 274 మంది, డీపీఈడీలో 46 మందికి 6 మంది ఉత్తీర్ణత సాధించారు. 15 రోజుల్లోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎస్ఐ చొరవ.. ఇంటర్ విద్యార్థులకు ఊరట



విద్యార్థులను, ప్రయాణికులను ఆటోల ద్వారా తరలిస్తున్న ఎస్ఐ మధుసూదనరావు

జి.సిగడాం: రాజాం–శ్రీకాకుళం ప్రధాన రహదారి దవళపేట గ్రామం వద్ద చీకటిలో భారీ ఊక లారీ మట్టిలో కూరుకుపోవడంతో శనివారం ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. పొందూరు నుంచి రాజాం, రాజాం నుంచి పొందూరు ఇంటర్ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు ఇందులో ఇరుక్కుపోయారు. దీంతో స్థానిక ఎస్ఐ వై.మధుసూధనరావు, ఆర్‌అండ్‌బీ ఏఈఈ పీటీ రాజుతోపాటు ప్రత్యేక పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ప్రత్యేక వాహనాల ద్వారా కేంద్రాలకు పంపించామని, మట్టిలో కూరుకుపోయిన లారీని యంత్రాల ద్వారా బయటకు తీసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించామన్నారు.

సముద్రంలోకి వెళ్తున్న తాబేలు పిల్లలు



బతకాలిలే..


సాగర గర్భంలో తల్లులు, ఎక్కడో దూరంగా తీరంలో పిల్లలు.. ఆ తల్లీపిల్లలు కలుసుకోవడానికి సవాలక్ష ఆటంకాలు. ప్రకృతి వైపరీత్యాలు, జంతువుల దాడులు, ఆకతాయిల వికృత చేష్టలు అన్నీ తట్టుకుని నిలబడితేనే ఆ పిల్లలు కడలి గర్భంలోకి వెళ్లగలవు. లేదంటే అండంలో ఉన్నప్పుడే ఆయుష్షు తీరిపోతుంది. ఇలాంటి ఆపత్కాలంలో ఉన్న ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లల ఆయుష్షుకు అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు అండగా నిలబడుతున్నారు. తీరంలో గుడ్లను సంరక్షించి అవి పొదిగి పిల్లలు బయటకు వచ్చే వరకు జాగ్రత్తగా చూసి.. బుల్లి బుల్లి తాబేలు పిల్లలు ఆనందంగా సముద్రంలోకి వెళ్లడాన్ని మురిపెంగా చూస్తున్నారు.

- తాబేళ్లకు రక్షణగా ట్రీ ఫౌండేషన్, అటవీశాఖ
- సాగర తీరంలో సంరక్షణ కేంద్రాలు
- తాబేలు గుడ్లకు రక్షణ
- పొదిగిన తర్వాత తీరంలోకి పిల్లలను వదిలిపెడుతున్న సభ్యులు

సోంపేట:

సముద్రంలో లక్షలాది జీవులు నివాసం ఉంటాయి. అందులో సముద్రానికి మేలు చేసే జాతుల్లో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు ఒక జాతి. ఆ రకం తాబేళ్లు గుడ్లు పెట్టుకునేందుకు మన తీరాలను అనువుగా ఎంచుకున్నాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత సముద్ర తీరానికి వచ్చి తీరంలో గొయ్యి తవ్వి గుడ్లు పెడతాయి. అనంతరం వాటిని కప్పేసి సముద్రంలోకి వెళ్లిపోతాయి. తీరంలో గుడ్లు పెట్టడానికి అనువైన స్థలం చూసుకుని గుడ్లు పెడుతుంటాయి. అలా వచ్చినప్పుడు బోట్లు తగిలి కొన్ని తాబేళ్లు చనిపోతుంటాయి. ప్రస్తుతం ఆలివ్‌రిడ్లే తాబేళ్లు అంతరించి పోయే ప్రమాదంలో ఉండడంతో అటవీశాఖ పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో తాబేళ్ల సంరక్షణకు నడుం బిగించింది.

50 నుంచి 150 గుడ్లు



తీరంలో గుడ్లు పెడుతున్న ఆలివ్‌రిడ్లే తాబేలు



తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు

సాధారణంగా ఈ జాతి తాబేళ్లు 50 నుంచి 150 వరకు గుడ్లు పెడుతుంటాయి. అర్ధరాత్రి 2 గంటల నుంచి ఉదయం 5 గంటల లోపు తీరానికి చేరుకుని ఇసుకలో గోతులు తవ్వి వాటిలో గుడ్లు పెట్టి, తిరిగి వాటిపై ఇసుక కప్పి తల్లి తాబేళ్లు సముద్రంలోకి వెళ్లిపోతాయి.

ప్రత్యేక జీవులు

ఆలివ్ రిడ్లే తాబేళ్లు చాలా ప్రత్యేకమైనవి. వీటికి స్థిర నివాసం ఉండదు. రెండు అడుగుల పొడవు, సుమారు 150 కిలోలు పైన బరువు ఉండే తాబేళ్లు ఆహార అన్వేషణ, గుడ్లు పెట్టడం, సంతానోత్పత్తి కోసం సుమారు 20 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. డిసెంబర్ నుంచి మార్చి రెండో వారం వరకు ఎక్కువగా గుడ్లు పెడుతుంటాయి.

మత్స్యకారులు సహకరించాలి

తాబేలు గుడ్లను సంరక్షించడానికి అటవీ శాఖాధికారులు, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులకు మత్స్యకారులు సహకరించాలి. అంతరించే స్థితిలో ఉన్న ఆలివ్‌రిడ్లే తాబేళ్లను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. గుడ్లను సంరక్షించే బాధ్యత అటవీ శాఖ తీసుకుంటుంది. గత ఏడాది సుమారు లక్షా యాభై వేల పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టాం. ఈ ఏడాది అంతకన్నా ఎక్కువ పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు.

– నాగరాజు, జిల్లా అటవీ శాఖాధికారి

● గుడ్లకు సంరక్షణ..

తీరంలో తాబేళ్లు గుడ్లు పెట్టి వెళ్లిపోయాక జిల్లాలో అటవీ శాఖ అధికారులు, ట్రీ ఫౌండేషన్ సౌజన్యంతో గుడ్లను సంరక్షణ కేంద్రాలకు తరలిస్తున్నారు. జిల్లాలో మొత్తం మూడు డివిజన్ల పరిధిలో 16 సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇచ్ఛాపురం నియోజక వర్గంలో 7 కేంద్రాలు ఏర్పాటు చేశారు. నియోజక వర్గంలోని సోంపేట మండలం బట్టిగళ్లూరు, బారువపేట, ఇస్కలపాలేం, కవిటి మండలం కళింగపట్నం, బట్టివాని పాలేం, సీహెచ్ కపాసుకుద్ది, ఇచ్ఛాపురం మండలం డొంకూరులో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత సంవత్సరం జిల్లాలో 1,59,403 గుడ్లు సేకరించి 1,44,981 పిల్లలుగా తయారు చేసి సముద్రంలోకి విడిచిపెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది గత ఏడాది కంటే ఎక్కువ పిల్లలను తయారు చేసి సముద్రంలోకి విడిచి పెట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఇప్పటి వరకు శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ డివిజన్‌ల పరిధిలో 452 నెట్లు ఏర్పాటు చేసి 53,400 గుడ్లు సేకరించారు. సుమారు 40 రోజుల పాటు రక్షణ వలయంలో ఉంచి గుడ్లు పొదిగి పిల్లలుగా మారిన తర్వాత వాటిని సురక్షితంగా సముద్రంలోకి విడిచిపెడతారు.



కేంద్రంలో ఏర్పాటు చేసిన నెట్స్

గుడ్లను సంరక్షించడం ఆనందం



గత కొన్నేళ్లుగా అటవీ శాఖాధికారుల సౌజన్యంతో ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల గుడ్లు సేకరించి, వాటిని పిల్లలుగా తయారు చేసి సముద్రంలోకి విడిచి పెట్టడం ఆనందంగా ఉంది. జిల్లాలో మత్స్యకారులు సహాయ సహకారాలు అందించడంతో ఈ కార్యక్రమం విజయవంతం అవుతుంది.

– కె.సోమేశ్వరరావు, ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్

‘గ్యాస్’ అదనపు వసూళ్లపై కలెక్టర్ ఆగ్రహం



మూగోడివీధిలో మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పొందూరు: మండల కేంద్రంలో గ్యాస్ వినియోగదారుల నుంచి రూ. 40 నుంచి రూ. 50లు అదనంగా వసూలు చేయడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన పర్యటించారు. పలువురు మహిళలతో మాట్లాడారు. గ్యాస్ ధర తెలుసా అని ఆరా తీస్తే.. తెలియదని చెప్పడంతో సెల్‌ఫోనులో బిల్లుకు సంబంధించిన మెసేజ్ చూపించారు. రూ. 829లుగా మహిళలు తెలుసుకున్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ అదనపు వసూలు చేస్తున్నట్లు వారు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మొత్తం కలిపి రూ.870 నుంచి రూ.880లు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో డీఎస్‌ఓతో ఫోన్‌లో మాట్లాడారు. బిల్లు కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం డీఎస్‌ఓ జి.సూర్యప్రకాశ్ శనివారం తహశీల్దార్ కార్యాలయంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బందిని విచారించారు. తమకు 14 ఏళ్లుగా ఎలాంటి జీతాలు ఇవ్వడం లేదని, అదనపు వసూళ్లే తమకు ఆదాయమని డెలివరీ బాయ్స్ చెప్పారు. దీనిపై తహసీల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ లేబర్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



పనసతో విందు.. భలే పసందు

- ఉద్దానం పనసకు భలే గిరాకీ
- ఉత్తరాదికి విరివిగా ఎగుమతి
- రోజుకు 55 టన్నుల సరఫరా



ఉద్దానం ప్రాంతం నుంచి తరలిస్తున్న పనసకాయలు

వజ్రపుకొత్తూరు:

ఉద్దానం పనస ఉత్తరాదికి తరలి వెళుతోంది. హోలీ, ఉగాది పర్వదినాలు ముందుండడంతో ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి ఊపందుకుంది. ఉత్తరాది రాష్ట్రాల్లో పనసతో చేసే విందులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. పనస హల్వా, పొట్టు కూర, పకోడి, గింజల కూర, ఇడ్లీ పచ్చళ్లు, బూరెలు లాంటి వంటకాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక స్థానికంగా ఉద్దానం ప్రాంతంలోని పెళ్లిళ్లలో పనస ముక్కల బిర్యానీ, గూన చారు, పొట్టు కూరకు మంచి పేరుంది. ఇటీవల శాస్త్ర పరిశోధనల్లో పనస గింజలు, పొట్టుతో తయారు చేసే పొడితో షుగర్ వ్యాధికి ఇన్సులిన్ అదుపులో ఉంచుకునేందుకు అవసరమైన ఫైబర్ ఎక్కువ ఉందని తేలడంతో పనస ఆధారిత వంటకాలకు ప్రాధాన్యత పెరిగింది. సహజ సిద్ధంగా కల్తీ లేకుండా పెరిగే పనస ప్రతీ వయసు వారు తినేందుకు అనుకూలమైన ఫలం కావడం విశేషం. 70 శాతం ఎగుమతి చేసే ఒక్క కాయలోనే కాదు. 30 శాతం ఫలాలుగా తినే పండులోనూ మంచి పోషకాలు ఉంటాయని న్యూట్రిషియన్‌లు చెబుతున్నారు.

మిశ్రమ పంటగా..



జిల్లాలోని ఉద్దానం, గిరిజన ప్రాంతాల్లో ప్రధాన పంటగా కాకుండా 16వేల హెక్టార్లలో మిశ్రమ అంతర పంటగా దీన్ని రైతులు పండిస్తారు. సీతంపేటతో పాటు వజ్రపుకొత్తూరు, పలాస, మందస, కవిటి, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం, నందిగాం మండలాల్లో ఏటా ఏప్రిల్, మే నెలల్లో కాపునకు వచ్చే ఈ పంట ప్రస్తుతం ఫిబ్రవరి ప్రారంభంలోనే కాపునకు వచ్చింది. మే నెల వరకు వచ్చే కాపులో 70 శాతం మేర కాయలను ఉత్తరాది రాష్ట్రాలైన ఒడిశా, బీహార్ ఉత్తరప్రదేశ్, కోల్‌కతాలకు ఎగుమతి చేస్తున్నారు. పూండి, పలాస, హరిపురం, పాలకొండ కేంద్రాలుగా కిలో పనస కాయ రూ.25 ధరతో రోజుకు 55 టన్నుల వరకు ఎగుమతి చేస్తున్నారు. అంటే రోజుకు జిల్లా నుంచి రూ. 13.75 లక్షలు టర్నోవర్ జరుగుతోంది. దీంతో రైతులకు మే నెల వరకు మంచి ఆదాయం సమకూరుతుంది.

పనస ప..ద..ని..స





వంటకాలు:

హల్వా, పొట్టు కూర, పకోడి, గింజల కూర, ఇడ్లీ పచ్చళ్లు, బూరెలు

- ఉద్దానం ప్రాంతంలోని పెళ్లిళ్లలో పనస ముక్కల బిర్యానీ, గూన చారు, పొట్టు కూర

ఔషధ విలువలు:



పనస గింజలు, పొట్టుతో తయారు చేసే పొడితో షుగర్ వ్యాధికి సంబంధించి ఇన్సులిన్ అదుపులో ఉంచుకునేందుకు అవసరమైన ఫైబర్ ఎక్కువ ఉందని శాస్త్ర పరిశోధనల్లో తేలింది.

ఎగుమతి ఎక్కడికి:

ఒడిశా, బీహార్ ఉత్తరప్రదేశ్, కోల్‌కతా

సరఫరా రోజుకు **55** టన్నులు



పలాస మార్కెట్‌లో పనస కాయల విక్రయాలు

అదనపు ఆదాయం



పనస రైతులకు అదనపు ఆదాయ వనరు. జీడి, కొబ్బరి తోటల్లోని గట్లపై ఖాళీ స్థలాల్లో మిశ్రమ అంతర పంటగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఎలాంటి చీడ పీడలు ఆశించకుండా పంట కాసింది. పంట ప్రారంభం కాబట్టి కిలో రూ.25ల వరకు ధర ఉంది. ఎకరాకి 4 నుంచి 10 చెట్లు వరకు గిరిజన, ఉద్దానం ప్రాంతాల్లో రైతులు పనసను పండిస్తున్నారు. ఏడాదికి రైతు రూ.20 వేలు వరకు ఆర్జిస్తున్నారు.

– కె.సునీత, ఉద్యానవన శాఖ అధికారి, పలాస



శ్రీముఖలింగం ఆలయంలో సంప్రోక్షణ పూజలు చేస్తున్న అర్చకులు

● సంప్రోక్షణ పూజలు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలు అనంతరం శనివారం ఉదయం సంప్రోక్షణ, శుద్ధి, పుణ్యాహవచన పూజలు ఘనంగా జరిగాయి. పుణ్యతీర్థాలతోపాటు పంచగవ్యంతో శుద్ధి చేశారు. ఉదయం ఈ సంప్రోక్షణ పూజలు పూర్తి చేసి ప్రత్యేక దర్శనాలకు అనుమతినిచ్చారు.

● ఆదాయం రూ.6.65 లక్షలు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరునికి శివరాత్రి ఆదాయం రూ.6,65,983 వచ్చిందని ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు శనివారం తెలిపారు. ప్రత్యేక దర్శనం ద్వారా రూ.2,00,260, పులిహోర ప్రసాదం ద్వారా రూ.1,03,440, హుండీ ద్వారా రూ.2,83,373 వచ్చిందన్నారు. ప్రధాన హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కిస్తారు.

● పింఛన్లు పంపిణీ 94.71 %

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్టీఆర్ పింఛన్ కానుక ఈ నెలకు గాను శనివారం సాయంత్రానికి 94.71 శాతం పంపిణీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయం సిబ్బంది ఈ పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఈ నెలకు జిల్లాలో అన్ని రకాల పింఛన్లు కలిపి 3,10,124 పింఛన్లకు గాను 2,93,732 మందికి అందజేశారు.

తొలిరోజు 685 మంది గైర్హాజరు

- తొలిరోజు సెట్–2 ప్రశ్న పత్రంతో పరీక్ష రాసిన ఫస్టియర్ విద్యార్థులు
- నిమిషం నిబంధనతో అష్టకష్టాలు పడిన విద్యార్థులు

● ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు





ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు రాశారు. తొలిరోజు సెట్–2 ప్రశ్న పత్రంతో తెలుగు, సంస్కృతం, హిందీ, ఒరియా పేపర్లకు విద్యార్థులు పరీక్ష రాశారు. పునర్విభజన శ్రీకాకుళం (30 మండలాలు)జిల్లా వ్యాప్తంగా 75 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలకు తొలిరోజు మొత్తం 21,127 మంది హాజరుకావాల్సి ఉండగా 20,442 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 685 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు ఎలాంటి మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదుకాలేదని అధికారులు ధ్రువీకరించారు. సోమవారం నుంచి సీనియర్ ఇంటర్ పరీక్షలు మొదలుకానున్నాయి.

పరీక్ష కేంద్రాల పరిశీలన

జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను పలువురు అధికారులు చుట్టుముట్టారు. తొలిరోజే ఆకస్మిక తనిఖీలతో హోరెత్తించారు. సెల్ఫ్ సెంటర్లు, ఎంపిక చేసుకున్న సెంటర్లపై ఫోకస్ చేస్తున్నారు. డీఈసీ–2 పీవీఎల్ నారాయణతో కలిసి జిల్లా స్పెషల్ ఆఫీసర్, డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు ఎచ్చెర్లలోని రెండు కేంద్రాలతోపాటు కొయ్యాం కళాశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏర్పాట్లను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు, డిస్ట్రిక్ట్ బల్క్ అధికారి బి.శ్యామ్‌సుందర్, డీఈసీ–3 బి.సింహాచలంతో కూడిన బృందం శ్రీకాకుళంలోని పెద్దపాడు ఏపీ రెసిడెన్షియల్ గురుకుల విద్యాలయం, శ్రీచైతన్య జూనియర్ కళాశాల రెండు కేంద్రాలలో తనిఖీలు చేశారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతి లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో విద్యార్థులు ఆపసోపాలు పడ్డారు. అలాగే కరెంట్ కోతలతో అటు విద్యార్థులు, ఇటు పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అధికారులు, సిబ్బంది అవస్థలు పడ్డారు.



నోటీసు బోర్డు వద్ద తమ హాల్‌టిక్కెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

క్లుప్తంగా

ఆకాశవాణిలో బద్రి ప్రసంగం


ప్రసంగిస్తున్న బద్రి కూర్మారావు

పలాస: మండలంలోని రంగోయి గ్రామానికి చెందిన గిడుగు రామ్మూర్తి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు జానపద కళల పరిశోధకుడు బద్రి కూర్మారావు విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రంలో శనివారం ఉత్తరాంధ్ర గిరిజన తెగలు–సంస్కృతి అనే అంశంపై ప్రసంగించారు. సవర, జాతాపు, గదభ, కొండదొర, మన్నెదొర, కొండ రెడ్లు, భగత వాల్మీకి తదితర 20 ఆదివాసీ తెగల ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి, పాటలు తదితర అంశాలను వివరించారు. ఆదివాసీ సంస్కృతి చాలా గొప్పదని, నాగరకత పెరుగుతున్న కొలదీ ఆదివాసీలు తమ భాషను, సంస్కృతిని మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషను కాపాడుకోవాలని కోరారు. కాగా, ఈ నెల 8, 9, 10 తేదీల్లో తిరుపతిలో జరగనున్న భారత జనపద విజ్ఞాన సదస్సులో పాల్గొని ఉత్తరాంధ్ర జానపద కళలు, సాహిత్యంపై పత్రాలు సమర్పిస్తున్నట్లు బద్రి కూర్మారావు చెప్పారు.

ప్రతిభకు ప్రశంసలు


ఎస్‌ఐ హరికృష్ణకు ప్రశంసాపత్రం అందిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : ప్రాపర్టీ, చైన్ స్నాచింగ్, దొంగతనాల వంటి కేసులు ఛేదించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అదనపు ఎస్పీలు కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్షలో సీఐలు, ఎస్‌ఐలకు డీఎస్పీ సీహెచ్ వివేకానంద సమక్షంలో ప్రశంసాపత్రాలను అందించారు. గార మండలం శాలిహుండంలో 17 తులాల బంగారం కేసులో కీలక పాత్ర పోషించిన ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ వీరిలో ఉన్నారు.

‘శిష్టకరణ సంఘానికి ఎన్నికలు నిర్వహించలేదు’

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శిష్టకరణ రాష్ట్ర సంఘానికి ఎటువంటి ఎన్నికలు నిర్వహించలేదని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంఘం లెపి 45 బ్రాంచీల అధ్యక్షులు ఎన్నికలకు ముందుకు వచ్చిన సందర్భంలో తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులుగా, కార్యదర్శిగా పాత వర్గాన్ని కొనసాగించాలని అందరూ తీర్మానించిన సందర్భంలో ఎన్నికలు అవసరం లేదని నిర్ణయించినట్లు తెలిపారు. ఓబీసీ సాధన జరిగిన తర్వాత ఎన్నికల ప్రస్తావన తెరపైకి వచ్చే అవకాశం ఉందన్నారు. స్వలాభం కోసం నలుగురైదుగురు కలిసి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్నిక అని ప్రకటిరచడం సరికాదన్నారు. తమ దృష్టికి తీసుకురాకుండా ఎవరైనా నిర్ణయాలు తీసుకుంటే, అటువంటి వారిని రాష్ట్ర కార్యవర్గం నుంచి తప్పిస్తూ క్రమశిక్షణ చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

జిల్లా క్రికెటర్లకు సత్కారం


సత్కారం అందుకున్న క్రికెటర్లతో అతిథులు, జిల్లా క్రికెట్ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడాకారులు ముఖ్యంగా క్రికెట్‌లో అడుగుపెట్టినవారు నిర్దేశిత లక్ష్యాలను ఏర్పాటుచేసుకుని అకుంఠిత దీక్షతో వాటిని అందిపుచ్చుకోవాలని ఏఎస్పీ ఆర్.వెంకటరమణ అన్నారు. 2024–25 సీజన్‌లో వివిధ విభాగాల్లో ఏసీఏ అంతర్ జిల్లాల, అంతర్‌జోనల్, స్టేట్, అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీల్లో ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారులను జిల్లా క్రికెట్ సంఘం ఘనంగా సత్కరించింది. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీఏ గేమ్స్ విభాగం జీఎం ఎంఎస్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా నుంచి త్వరలో మరో ముగ్గురికి రంజీల్లో ప్రవేశం లభించే అవకాశముందన్నారు. ఇప్పటికే స్టార్ ఆల్‌రౌండర్ త్రిపురాణ విజయ్‌కు ఐపీఎల్‌లో ఎంట్రీ లభించడం శుభపరిణామమని పేర్కొన్నారు. అనంతరం జిల్లాలో 2021–22 తర్వాత జిల్లా క్రికెట్ సంఘం సాధించిన ప్రగతి, క్రికెట్ క్రీడాకారుల ఫలితాలను జెడ్‌సీఎస్ మెంటార్ ఇలియాస్ మహ్మద్ వివరించారు. నిరుపేద క్రీడాకారులకు షూ, బ్యాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్ వందాన మురళీమోహన్, క్రీడా ప్రోత్సాహకులు దుప్పల వెంకట్రావు, జెడ్‌సీఎస్ కోశాధికారి మదీనా శైలానీ, డాక్టర్ సువ్వారి రవికుమార్, గుంట పురుషోత్తమ నాయుడు, రవికిరణ్, క్రీడాకారులు త్రిపురాన విజయ్, ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్, ఎన్.హిమకర్, ఆర్.జున్నారావు, నంబల్ల సుశాంత్, మొదలవలస పూర్ణచంద్ర, శిమ్మ సాత్విక్, సీహెచ్ యోజిత్, జోగేంద్ర, వివేక్‌నందా, వ్రత కిరణ్, ఎస్‌వీ ప్రేరణ్, కె.హిమచంద్ర, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ గారూ.. మెల్లగా.. తగ్గాలి జోరు!

- రాజాం–చిలకపాలెం రోడ్డులో విశాఖ వెళ్లే బస్సుల దూకుడు
- అసలే ఇరుకు రహదారి.. ఆపై మలుపులు
- తరచూ ప్రమాదాలతో ఆందోళన


పొందూరు మండలం రెడ్డిపేట వద్ద ప్రమాదానికి గురైన నాన్‌స్టాప్ బస్సు(ఫైల్)

పొందూరు: పాలకొండ ఆర్టీసీ డిపో నుంచి పొందూరు, చిలకపాలెం కూడలి మీదుగా విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, నాన్‌స్టాప్ బస్సు సర్వీసులు అతివేగంతో ప్రయాణిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొంతమంది డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, ఆయా రూట్ల పరిధిలోని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా నాన్‌స్టాప్ సర్వీసు దూకుడుగా వెళ్తోందంటూ ఆ రూట్లలో ప్రయాణాలు సాగిస్తున్న వారు చెబుతున్నారు. అసలే పాలకొండ – చిలకపాలెం ప్రధాన రహదారి ఇరుకైనది. సుమారు 45 కిలోమీటర్ల మేర ఉన్న ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఉన్నాయి. దీనికి తోడు క్రషరీలు, క్వారీలు ఎక్కువగా ఉండటంతో ట్రాక్టర్లు, టారీలు దూసుకొస్తుంటాయి. ఆ వాహనాల కారణంగా ఇప్పటికే అనేక మంది ప్రమాదాలకు గురికాగా.. కొందరు మృత్యువాత కూడా పడ్డారు. అటువంటి ప్రమాదకర రోడ్డులో ఎంతో సురక్షితంగా ప్రయాణికులను తీసుకెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు సైతం మితిమీరిన వేగంతో ప్రయాణించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల పాలకొండ నుంచి విశాఖపట్నం వెళ్లే నాన్‌స్టాప్ బస్సు పొందూరు మండలం రెడ్డిపేట వద్ద చెట్టుకు ఢీకొట్టి ఆగిపోయిన సంగతి తెలిసిందే. డ్రైవర్ రెప్పవాల్చటంతో ఈ ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. తొమ్మిది మంది ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇప్పటికైనా ఆర్టీసీ ప్రయాణం సురక్షితం అనే భావన కొంతమంది డ్రైవర్ల తప్పిదాలు మూలంగా చెడిపోకూడదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి..



రాజాం, పొందూరు మీదుగా చిలకపాలెం వరకు సింగిల్ రోడ్డు కావడం వల్ల డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి. ఈ పాలకొండ ఆర్టీసీ డిపో డ్రైవర్ల తీరు సరిగ్గా లేదు. ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలి.

– వాండ్రంగి కొండలరావు, విశ్రాంత స్కూల్ అసిస్టెంట్, పొందూరు

రోడ్డును విస్తరించాలి...



చిలకపాలెం హైవే నుంచి రాజాం, బొబ్బిలి రోడ్డును విస్తరించాలి. రాజాం నుంచి విశాఖపట్నం వెళ్లే నాన్‌స్టాప్ బస్సులు, ఎక్స్‌ప్రెస్‌లు అతివేగంగా వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పూజారి హరిప్రసన్న, పొందూరు

అతివేగంతోనే ప్రమాదాలు..



పాలకొండ నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులు అతివేగంతో ప్రయాణిస్తున్నాయి. వేగం కంటే ప్రయాణికుల సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడమే ముఖ్యం. బస్సుల్లో ఎక్కువగా వృద్ధులు, మహిళలు ప్రయాణిస్తుంటారు. వారిని జాగ్రత్తగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉంది.

– బందారు జైప్రతాప్‌కుమార్, ఖాదీ వ్యాపారి, పొందూరు

6 గంటలు నరకయాతన

రాజాం వైపు నిలిచిపోయిన లారీలు



రాజాం–శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ప్రయాణికులు సుమారు ఆరుగంటల పాటు మండుటెండలో నరకయాతన అనుభవించారు. జి.సిగడాం మండలం ధవళపేట గ్రామ సమీపంలో ఇటీవల కల్వర్టు పనులు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డులో శనివారం ఉదయం 5 గంటల సమయంలో భారీ లోడుతో వస్తున్న ఓ లారీ కూరుకుపోయింది. ఉదయం 11 గంటల వరకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరదంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు. ఎస్‌ఐ వై.మధుసూదనరావు, రహదారులు, భవనాల శాఖ ఏఈఈ పి.టి.రాజు ఘటనా స్థలానికి చేరుకుని యంత్రాల ద్వారా లారీని బయటకు తీయడంతో రాకపోకలు పునరుద్ధరణ జరిగాయి.

– జి.సిగడాం


కూరుకుపోయిన లారీని యంత్రాల ద్వారా బయటకుతీస్తున్న దృశ్యం


మండుటెండలో ప్రయాణికుల పాట్లు


పొందూరు-పాలఖండ్యాం గ్రామాల మధ్య నిలిచిన బస్సులు


ట్రాఫిక్ మళ్లిస్తున్న ఎస్‌ఐ మధుసూదనరావు

కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం


సభలో మాట్లాడుతున్న ఎన్.వేణుగోపాల్

పలాస: బొడ్డపాడు యువజన సంఘం ఆశయాలను, ఆశలను ప్రతిబింబించాలంటే దేశంలో జరుగుతున్న కాషాయీకరణ, కార్పొరేటు వ్యవస్థల విధానాలకు వ్యతిరేకంగా యువతరం కదం తొక్కాలని హైదరాబాద్‌కు చెందిన వీక్షణం పత్రిక ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. పలాస మండలం బొడ్డపాడులో బొడ్డపాడు యువజన సంఘం 71వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. 1954లో అప్పటి కమ్యూనిస్టు పార్టీ నాయకులు సంఘం ఏర్పాటు చేశారు. తదనంతరం జరిగిన అనేక పోరాటాల్లో సంఘం నాయకులు పోలీసు ఎదురుకాల్పుల్లో మృతి చెందారు. అయినా వెనకడుగు వేయకుండా నేటికీ పోరాటం కొనసాగిస్తూ అమరుడు తామాడ గణపతి మనవడు తామాడ క్రాంతి అధ్యక్షతన శనివారం వార్షికోత్సవ సభ ఏర్పాటు చేశారు. ముందుగా కార్మిక పతాకాన్ని అమరుల బంధు మిత్రుల కమిటీ నాయకుడు జోగి కోదండరావు ఆవిష్కరించారు. అనంతరం బొడ్డపాడు యువజన సంఘం పతాకాన్ని క్రాంతి ఆవిష్కరించారు. ప్రజాకళామండలి కళాకారులు విప్లవ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జగన్నాథం, కె.ఎన్.పి.ఎస్.నాయకుడు బెలమల ప్రభాకర్, డి.టి.ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోత ధర్మారావు, పి.కె.ఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దిల ధర్మారావు, ఎ.బి.ఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తామాడ త్రిలోచనావు, టెక్కలి డివిజన్ రైతాంగ కమిటీ మాజీ అధ్యక్షుడు దాసరి శ్రీరాములు, యువజన సంఘం సీనియర్ సభ్యుడు బచ్చల విప్లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల్లో దర్యాప్తు ముమ్మరం


మాట్లాడుతున్న అదనపు ఎస్పీలు కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ పెండింగ్ కేసులపై దర్యాప్తు ముమ్మరం చేయాలని జిల్లా అదనపు ఎస్పీలు కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు సూచించారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేవ్ కేసుల దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల్లో పారదర్శకంగా దర్యాప్తు సాగాలని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయాలని చెప్పారు. సమావేశంలో డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, డీఎస్‌ఆర్‌వీఎస్‌ఎన్ మూర్తి, వి.వి.అప్పారావు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మండుటెండలో మత్స్యకారుల నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన పెద్దకర్రివానిపాలెం మత్స్యకారులు

కవిటి: తరతరాలుగా ఇద్దివానిపాలెం పాగురు రేవులో బోట్లు, తెప్పలు నిలిపి అక్కడి నుంచే సముద్రంలో వేటకు వెళుతున్న తమను ఆ గ్రామస్తులు అడ్డుకుంటున్నారని పెద్దకర్రివానిపాలెం మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కవిటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండుటెండలో బైఠాయించి నిరసన తెలియజేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బెహర మురళీమోహనరావు పెద్దకర్రివానిపాలెం గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య, మాజీ ఎంపీటీసీ కర్రి చంద్రశేఖర్‌లతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెండు గ్రామాల పెద్దలతో సమావేశం నిర్వహించి గతంలో మాదిరిగా సఖ్యతతో వేట సాగేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై బైండోవర్ కేసులు బనాయించాలని కవిటి ఎస్‌ఐ వి.రవివర్మకు సూచించారు. అనంతరం పెద్దకర్రివానిపాలెం మత్స్యకారులు మాట్లాడుతూ సమస్య పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు.

వేతనజీవుల ఊసులేని రాష్ట్ర బడ్జెట్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్ర బడ్జెట్ సందర్భంగా వేతనాలు పెరుగుతాయని ఎదురుచూసిన వేతన జీవుల ఆశలను రాష్ట్ర ప్రభుత్వం అడియాసలు చేసిందని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేసి తిరిగి పాత కాంట్రాక్టు పద్ధతి పునరుద్ధరించడం వల్ల ఉద్యోగులు, కార్మికుల్ని అభద్రతాభావానికి గురవుతున్నారని చెప్పారు. గత ఏడాది ఆందోళన చేసిన అంగన్‌వాడీ, ఆశా, వెలుగు వీఓఏ, మధ్యాహ్న భోజన పథకం, సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్ వర్కర్లకు న్యాయం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్లో జీతాల పెంపుపై ఎటువంటి ప్రస్తావన చేయకపోవడం దారుణమన్నారు.

5న ఎంఎస్‌ఎంఈ రుణమేళా


మాట్లాడుతున్న రీజనల్ హెడ్ తిలక్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఈ నెల 5వ తేదీన ఎంఎస్‌ఎంఈ రుణాలకు సంబంధించి రుణమేళాను నిర్వహించనున్నట్టు యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఎం.వెంకట్ తిలక్ తెలిపారు. శ్రీకాకుళంలోని వెంకటాపురంలో ఉన్న యూనియన్ బ్యాంకులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం రీజియన్ పరిధిలో యూనియన్ బ్యాంక్‌కు సంబంధించి 59 బ్రాంచ్‌లు ఉన్నాయని, శ్రీకాకుళం జిల్లాలో 43 బ్రాంచ్‌లు, పార్వతీపురం జిల్లాలో 16 బ్రాంచ్‌లు ఉన్నాయని వివరించారు. వీటి పరిధిలో రూ.8వేల కోట్ల మేర బిజినెస్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తమ బ్యాంకుల ద్వారా ఎంఎస్‌ఎంఈల రూపంలో గృహ, రిటైల్, విద్య, గోల్డ్, వ్యవసాయ తదితర రుణాలన్నీ అందజేస్తామని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశ వ్యాప్తంగా ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు దేశంలోని అన్ని బ్రాంచ్‌ల్లో ఎంఎస్‌ఎంఈ రుణమేళా నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. అందులో భాగంగా ఈనెల 5న శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో రుణమేళా నిర్వహిస్తున్నామన్నారు. దీన్ని జిల్లా ప్రజలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేళాకు ముంబైలోని యూనియన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి జీఎం పి.శ్రీనివాస్ హాజరవుతారన్నారు. రుణమేళాకు వచ్చి రుణాలు అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

దేవుడి భూములు కబ్జా!

- సింగుపురంలో అన్యాక్రాంతమవుతున్న హాటకేశ్వరుడి స్థలం
- రెండంతస్తుల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- కూటమి నేతల అండదండలతో ఇష్టారాజ్యం
- పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు


హాటకేశ్వరస్వామి దేవస్థానం స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ భవనం ఇదే

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురంలో హాటకేశ్వర స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. సర్వే నంబర్ 260/14లో 84 సెంట్ల విస్తీర్ణంలో దేవుడి భూములు ఉన్నాయి. అయితే ప్రధాన రహదారిని అనుసరించి ఓ వ్యక్తి సుమారు 6 సెంట్ల విస్తీర్ణంలో రెండు అంతస్తుల్లో షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని అడ్డగోలుగా నిర్మించేశాడు. వాస్తవంగా ఈ స్థలాన్ని పూర్వం నుంచి గ్రామస్తులు రాకపోకలకు వాడుకునేవారు. స్థానికుల ఇళ్ల నుంచి వాడుక నీరు వెళ్లేందుకు సైతం పిల్లకాలువలా ఉండేది. ప్రస్తుతం అక్రమ నిర్మాణం చేపట్టడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేకుండానే..

వాస్తవంగా ఏదైనా భవనం నిర్మాణం చేపట్టాలంటే పంచాయతీ నుంచి అన్ని అనుమతులు విధిగా తీసుకోవాలి. ఇక్కడ ఎలాంటి ప్లాన్ అప్రూవల్ లేకుండానే రెండు అంతస్తుల భవనం నిర్మించడం గమనార్హం. కూటమి నేతల అండదండలు ఉండటంతోనే పనులు దర్జాగా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

సింగుపురంలోని దేవుడు మాన్యం భూములను పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రధాన మార్గంలో భూములే కబ్జాలకు గురవుతున్నాయంటే ఇంకా లోపల ఉన్న భూములు పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన దేవదాయశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై దేవదాయశాఖ అధికారి మాధవి వద్ద ప్రస్తావించగా తొలుత నోటీసులు అందించామని, తర్వాత తన దృష్టికి రాలేదని మాట దాటవేశారు.

నోటీసులు అందించాం

దేవుడు మాన్యం భూములు కబ్జాకు గువుతున్నాయని సమాచారం రావడంతో భవన నిర్మాణం చేపడుతున్న వ్యక్తికి సింగుపురం గ్రామ పంచాయతీ తరఫున నోటీసులు అందించాం. దేవుడి మాన్యం భూములు కాపాడుకోవాల్సిన బాధ్యత దేవాదాయశాఖదే.

– రమేష్, పంచాయతీ సెక్రటరీ, సింగుపురం

మహిళ అనుమానాస్పద మృతి


జంగం రాధ(ఫైల్)

కాశీబుగ్గ : పలాస రైల్వేస్టేషన్‌లో శనివారం ఓ మహిళ అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస మండలం మరదరాజపురం గ్రామానికి చెందిన జంగం రాధ(39)కు ఒడిషా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాఖిమిడికి చెందిన శ్రీనివాస పండాతో వివాహం జరిగింది. పదేళ్ల కిందట భర్త మృతిచెందడంతో రాధ కన్నవారింటికి వచ్చేసింది. పలాస వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఎఫ్‌సీ గోదాములో పనిచేస్తోంది. శనివారం సాయంత్రం విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆరా తీయగా పలాస రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పద రీతిలో విగతజీవిగా కనిపించింది. ఈమెకు పాప, బాబు ఉన్నారు. మృతదేహాన్ని జీఆర్‌పీ ఏడీ మెట్ట సోమేశ్వరరావు పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని యువకుడు దుర్మరణం


బల్ల పాపారావు (ఫైల్)

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మొగిలిపాడు జాతీయ రహదారిపై సాహూ దాబా వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. లక్ష్మీపురం టోల్‌ప్లాజాలో సీసీ పుటేజీ విభాగంలో పనిచేస్తున్న మందస మండలం అంబుగాం గ్రామానికి చెందిన బల్ల పాపారావు (32) శనివారం మధ్యాహ్నం విందు భోజనానికి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీట్టింది. అనంతరం డ్రైవర్ పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన పాపారావును హైవే అంబులెన్సులో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మరణించాడు. పాపారావుకు తల్లిదండ్రులు, ముగ్గురు అక్కచెల్లెల్లు ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తండ్రి మాధవరావు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాశీబుగ్గ ఎస్‌ఐ చంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోరు



పలాస మండలం బొడ్డపాడులో శనివారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. బొడ్డపాడు యువజన సంఘం 71వ వార్షికోత్సవం సందర్భంగా ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరుగుతున్న ఈ పోటీలకు 30 జట్లు హాజరయ్యాయి. మొదటి పోటీలో గురుపూరు జట్టుపై నరసన్న పేట జట్టు విజయం సాధించింది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్.రామ్‌జీ, రాపాక అప్పలస్వామి, బి.ఈశ్వరరావు రిఫరీలుగా వ్యవహరించారు.

– పలాస